క్లుప్తంగా

నకిలీ మద్యంతో ప్రజారోగ్యం నాశనం



హిరమండలం: రాష్ట్రంలో నకిలీ మద్యంతో ప్రజారోగ్యం నాశనం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నాణ్యమైన మద్యం అంటూ చెప్పుకొచ్చిన చంద్రబాబు సొంత పార్టీ నేతలతో నకిలీ మద్యం చేయిస్తున్నారని ఆరోపించారు. కుటీర పరిశ్రమగా నకిలీ మద్యాన్ని మార్చేశారని విమర్శించారు. ప్రజలు గమనిస్తున్నారని సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ధ్వజస్తంభం శంకుస్థాపన

పోలాకి: మండలంలోని మబగాం గ్రామంలో శ్రీవల్లభ నారాయణస్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేయనున్న ధ్వజ స్తంభానికి శనివారం వేద పండితులు శృంగారం ధనుంజయ శర్మ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో పాటు గ్రామపెద్దలు, ధర్మకర్త లక్ష్మీదేవి తదితరులు సమక్షంలో కార్యక్రమం జరిగింది.

మెడికల్ కాలేజీలు ప్రభుత్వమే పూర్తి చేయాలి

ఆమదాలవలస: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే పూర్తి చేయాలని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద కోటి సంతకాల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీపీపీ పద్ధతిలో ప్రైవేటుకు అప్పగిస్తే పేదలకు వైద్య సేవలు అందని ద్రాక్షగా మిగులుతాయన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల జెడ్పీటీసీలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, రాష్ట్ర అనుబంధ విభాగ కార్యవర్గ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బద్రి రామారావు, దుంపల శ్యామలరావు, అత్తులూరి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలస గ్రామంలో గ్రామీణ పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువుల్లో వ్యాపించే గర్భకోశ, లివర్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకొని చికిత్స తీసుకోవాలని పశుగణాభివృద్ధిశాఖ ఏడీ రోణంకి ఆనందరావు తెలిపారు.

దళితులకు న్యాయం చేయండి

సరుబుజ్జిలి: మూలసవలాపురానికి చెందిన దళిత కుటుంబాలపై జరుగుతున్న దాడులపై న్యాయం చేయాలని జిల్లా దళిత హక్కుల పోరాట కమిటీ నాయకులు గొల్లపల్లి యర్రయ్య, సిరిపల్లి శ్రీనివాసరావులు కోరారు. ఇటీవల శ్రీకాకుళం పట్టణంలో దళితులపై జరిగిన దాడి ఘటనపై సవలాపురం జంక్షన్ వద్ద శనివారం నిరసన తెలిపారు. దళిత మహిళపై దాడులు చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

వీడని వరద.. తీరని కష్టం..!

- ఇంకా వరద నీటిలోనే పంట పొలాలు
- కుళ్లిపోతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాత



వరదల వలన సోమరాజపురం వద్ద నీటిలో ఉన్న వరిపంట

కొత్తూరు: ఇటీవల వంశధార ఉప్పొంగి వరదలు రావడంతో మండలంలోని రైతులు నష్టాల్లో మునిగిపోయారు. గత కొన్నేళ్లలో ఎన్నడూ రానంత వరద నీరు రావడంతో సుమారు 4 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. వరదలు వచ్చి వారం రోజులు దాటుతున్నా పంటలు ముంపునీటిలోనే ఉన్నాయి. మరోవైపు వరదలకు మండలంలోని నివగాం-గులమూరు, అంగూరు, బంకి, పొనుటూరు, కుంటిభద్ర, మాకవరంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారులు కోతకు గురయ్యాయి. మదనాపురం, కుంటిభద్ర, అంగూరు, సోమరాజపురం, నివగాం, వసప పొనుటూరుతో పాటు పలు గ్రామాల్లో వరి, చెరకు, అరటి తదితర పంటలు నీటిలో కుళ్లిపోతున్నాయి. కానీ వరదలకు నష్టపోయిన పంటలకు ఎంత నష్ట పరిహారం చెల్లిస్తామన్నది ప్రభుత్వం ప్రకటించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న నేతలు కనీసం పరిహారంపై ప్రకటన చేయకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికందిన సమయంలో వరదలు రావడంతో నష్టాల్లో కూరుకుపోయామని వాపోతున్నారు.



మదనాపురం వద్ద...

అప్పులు చేశాను



ఈ ఏడాది అప్పులు చేసి వరి సాగు చేశాను. వరదలకు పంట నీటమునిగి కుళ్లిపోయింది. దీంతో సాగు కోసం చేసిన అప్పులు తీర్చడం కష్టంగా మారింది. ప్రభుత్వం స్పందించి పంట నష్టం జరిగిన రైతులకు పరిహారాలు అందజేయాలి.

– రగుతు సన్యాసిరావు, అంగూరు,కొత్తూరు మండలం

రోడ్లు బాగు చేయాలి



వరదలకు నష్టపోయిన రోడ్లను ప్రభుత్వం తక్షణమే బాగు చేయాలి. వరదల వలన రోడ్లు పూర్తిగా కోతకు గురయ్యాయి. దీంతో ప్రయాణాలు ప్రమాదకరంగా మారిపోయాయి. ప్రభుత్వ స్పందించి పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– సిరిపురం హరీష్, ఆరికేపురం, కొత్తూరు మండలం

కల్తీ మద్యం విక్రయిస్తే చర్యలు



నరసన్నపేట: షాపులో మద్యం నాణ్యతను పరిశీలిస్తున్న సీఐ లీలారాణి తదితరులు



పొందూరు: మద్యం దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎస్‌హెచ్‌వో రాజు



ఆమదాలవలస: మద్యం దుకాణాల్లో పరిశీలన జరుపుతున్న ఎక్సైజ్ పోలీసులు



పాతపట్నం: తెంబూరులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసరావు

సరుబుజ్జిలి: కల్తీ మద్యాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ అభిజిత్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని రొట్టవలస, సవళాపురం జంక్షన్, సరుబుజ్జిలి జంక్షన్ల వద్ద వైన్‌షాపులను శనివారం తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు చేయాలని సూచించారు. ప్రతీ షాపు వద్ద ధరల పట్టికలు ఏర్పాటు చేయాలన్నారు.

ఫిర్యాదు చేయవచ్చు

నరసన్నపేట: మద్యం నాణ్యతలో అన్ని జాగ్రత్తలు ప్రభుత్వం తీసుకుంటోందని, ఎవరికైనా మద్యం నాణ్యతపై అనుమానాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14450కి ఫిర్యాదు చేయవచ్చని ఎక్సైజ్ సీఐ పి.లీలారాణి తెలిపారు. మండల కేంద్రంలోని పలు మద్యం షాపుల్లో శనివారం నాణ్యతను పరిశీలించారు. ఎక్కడా మద్యం కల్తీ అవుతున్నట్లు పరీక్షల్లో తేలలేదన్నారు. ఆమెతో పాటు నరసన్నపేట ఎక్సైజ్ ఎస్ఐ గురుమూర్తి తదితరులు ఉన్నారు.

పాతపట్నం: పాతపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో ఉన్న తొమ్మిది మద్యం దుకాణాల్లో మద్యం నిల్వలు, నమూనాలను క్షుణ్ణంగా పరిశీలించామని పాతపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు తెలిపారు. పాతపట్నం, సారవకోట మండలాల్లో ఉన్న తొమ్మిది మద్యం దుకాణాల్లో సీఐ ఆధ్వర్యంలో శనివారం నమూనాలు, నిల్వలను తనిఖీ చేశారు. సీఐ మాట్లాడుతూ రెండు మండలాల్లో ఉన్న తొమ్మిది మద్యం దుకాణాల్లో 85 నమూనాలను సేకరించి, నివేదికలను తీసుకున్నామన్నారు. మద్యం పూర్తి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉన్నాయని, ప్రతి నెలా మద్యం దుకాణంలో నమూనాలను పరిశీలిస్తున్నామన్నామని పేర్కొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని బార్‌లు, మద్యం దుకాణాల్లో ఆమదాలవలస ఎక్సైజ్ సీఐ జి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. మద్యం షాపుల్లో ఉన్న బాటిళ్లు, నిల్వల రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి పరిశీలించారు. మద్యం షాపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పక్కాగా పాటించాలని సూచించారు. ప్రతి నెలా అన్ని షాపుల నుంచి నమూనాలు సేకరించి నాణ్యతను నిర్ధారిస్తామని తెలిపారు. మద్యం నాణ్యతపై ఏవైనా ఫిర్యాదులుంటే టోల్ ఫ్రీ నంబర్ 14405కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. తనిఖీలలో ఎక్సైజ్ ఎస్ఐ సీహెచ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి పొందూరు, జి.సిగడాం మండలాల్లో శనివారం మద్యం దుకాణాలను స్టేషన్ ఎస్‌హెచ్‌వో రాజు తనిఖీలు చేశారు. మద్యం కల్తీకి సంబంధించి అనుమానం ఉంటే వినియోగదారులు వెంటనే 14405 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఆరోగ్యశ్రీని విస్మరిస్తున్నారు

- మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్
- ఉర్జాంలో రచ్చబండ



కోటి సంతకాల సేకరణలో ధర్మాన కృష్ణదాస్ తదితరులు

పోలాకి: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజల జీవనాడి లాంటి ఆరోగ్యశ్రీని విస్మరిస్తోందని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మండిపడ్డారు. మండలంలోని ఉర్జాం గ్రామంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు విజనరీ పేరుతో ప్రైవేట్ దందాలతోనే పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎంతో మంది పేద, అట్టడుగు వర్గాల ఆశలు ఆవిరయ్యేలా మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడంపై ధ్వజమెత్తారు. కోటి సంతకాలతో వాస్తవాలను గవర్నర్ ముందు ఉంచే ప్రయత్నం జరుగుతోందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారన్నారు. కార్యకర్తలతో కృష్ణచైతన్య కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణచైతన్యతో పాటు నియోజకవర్గ ముఖ్య నాయకులను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు, పార్టీ నాయకులు కణితి సత్తిబాబు, రెంటికోట త్రినాథరావు, చింతాడ ఉమ, చింతు రాఘవరావు, దంత సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పోలాకి జెడ్పీటీసీ డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. మండలంలో కోమర్తి క్లస్టర్‌లోని రావులవలస, కోమర్తి పంచాయతీల కార్యకర్తలు, ముఖ్య నాయకులతో రచ్చబండ కార్యక్రమం శనివారం సాయంత్రం గుండవల్లిపేట శివాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలన అంతా మోసాలమయంగా ఉందన్నారు. ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. కార్యకర్తలకు అన్నివిధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, లుకలాపు రవి, పంచిరెడ్డి సత్యం, మద్దు కృష్ణ, ఉంగటి రాజేశ్వరరావు, యాబాజీ రమేష్, కనపల శేఖరరావు, బొబ్బాది ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో .. నియామకాలు

నరసన్నపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలకు కమిటీ అధ్యక్షుల పేర్లను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. పార్టీ యూత్ వింగ్ పోలాకి మండల అధ్యక్షుడిగా రెంటికోట త్రినాథరావు, జలుమూరు మండల అధ్యక్షుడిగా జుత్తు నేతాజీ, నరసన్నపేటకు బుద్దల రాజశేఖర్, సారవకోటకు కొండాల బాబూరావును నియమించారు. అలాగే మహిళా విభాగానికి సంబంధించి పోలాకికి అడ్ల చంద్రావతి, జలుమూరుకు తర్ర మాధవి, నరసన్నపేటకు అంపోలు సునీత, సారవకోటకు ఎస్.సుజాతమ్మను ఎంపిక చేశారు. అదేవిధంగా రైతు విభాగానికి సంబంధించి పోలాకికి వై.శ్రీధర్ రెడ్డి, జలుమూరుకు చెంచలి జోగారావు, నరసన్నపేటకు వాకముళ్ల చక్రధరరావు, సారవకోటకు మెండ సూర్యనారాయణ నియమితులయ్యారు. బీసీ సెల్ విభాగానికి పోలాకికి సీహెచ్ రామకృష్ణ, జలుమూరుకు పొన్నాడ విజయకుమార్, నరసన్నపేటకు వాన గోవిందరాజులు, సారవకోటకు కె.సింహాచలంలను నియమించారు. ఎస్సీ సెల్ విభాగానికి పోలాకికి బి.గడ్డెయ్య, జలుమూరుకు నవిరి పోతయ్య, నరసన్నపేటకు ఎన్.శ్రీనివాసరావు(డేవిడ్), సారవకోటకు కోరుకొండ శంకర్ బాబులను నియమించారు. ఎస్టీ సెల్‌కు సంబంధించి పోలాకికి గేదెల త్రినాథరావు, జలుమూరుకు బి.పాపారావు, నరసన్నపేటకు గొర్లె గోవిందరావు, సారవకోటకు లోకొండ సింహాచలంలు నియమితులయ్యారు. మైనార్టీ విభాగంకు సంబంధించి పోలాకికి షేక్ మదీన్ సాహెబ్, జలుమూరుకు జి.పూర్ణచంద్రరావు, నరసన్నపేటకు రమణ సాహూ, సారవకోటకు చల్ల తవిటయ్యలను నియమించారు. క్రిస్టియన్ మైనారిటీకి సంబంధించి పోలాకికి పల్లి గోపాల్, జలుమూరుకి మూకళ్ల రాజారావు, నరసన్నపేటకు పి.సింహాచలం, సారవకోటకు మెండ ముఖలింగంను ఎంపిక చేశారు. విద్యార్థి విభాగంకు సంబంధించి పోలాకికి జి.గణేష్, జలుమూరుకు బుద్దల శ్రీనివాస్, నరసన్నపేటకు పాగోటి రమణ భరద్వజ్, సారవకోటకు నక్క హాటకేశ్వరరావులు నియమితులయ్యారు. పంచాయతీ రాజ్ విభాగానికి సంబంధించి పోలాకికి దంత రమణ, జలుమూరుకు బోర సింహాచలం, నరసన్నపేటకు యాబాజి రమేష్, సారవకోటకు బాడాన కృష్ణారావులను నియమించారు. ఆర్టీఐ విభాగానికి సంబంధించి పోలాకికి బి.రమణమూర్తి, జలుమూరుకి పొన్నాడ ముసలినాయుడు, నరసన్నపేటకి దుల్ల రమణ, సారవకోటకి రావాడ శ్రీనివాసరావును ఎంపిక చేశారు. వలంటీర్ విభాగానికి సంబంధించి పోలాకికి చింతాడ కిషోర్, జలుమూరుకి పట్ట సుమతి, నరసన్నపేటకి బద్ధ రమణ, సారవకోటకి మెండ వైకుంఠరావును నియమించారు. వాణిజ్య విభాగానికి సంబంధించి పోలాకికి పి.ఫణిభూషణరావు, జలుమూరుకి బొమ్మాళి ప్రసాద్, నరసన్నపేటకు అరవల సుధాకర్, సారవకోటకి బూర్లె మోహనరావును నియమించారు. చేనేత విభాగానికి సంబంధించి పోలాకికి యేడిళ్ల సురేష్, జలుమూరుకి బేరి తవిటయ్య, నరసన్నపేటకు మానెం శివుడు, సారవకోటకు జి.సూరిబాబులను ఎంపిక చేశారు. వైఎస్సార్ టీయూసీ విభాగానికి సంబంధించి పోలాకికి బండి శ్రీనివాసరావు, జలుమూరుకి ఎన్.హరికృష్ణ, నరసన్నపేటకు పెదిరెడ్ల రాము, సారవకోటకు తాడేల రామదాస్‌ను నియమించారు. సాంస్కృతిక విభాగానికి సంబంధించి పోలాకికి పి.వెంకటేశ్వర పాణిగ్రాహి, జలుమూరుకి పిట్ట వరప్రసాద్, నరసన్నపేటకి నేతింటి సింహాచలం, సారవకోటకి ఇసా షణ్ముఖరావు, సోషల్ మీడియా విభాగానికి సంబంధించి పోలాకికి చింతాడ సోమేశ్వరరావు, జలుమూరుకి కర్రి అప్పయ్య, నరసన్నపేటకు కుప్పిలి రామకుమార్, సారవకోటకి చల్ల నరేష్‌ను నియమించారు. దివ్యాంగుల విభాగానికి సంబంధించి పోలాకికి బోర మన్మథరావు, జలుమూరుకి రావాడ మురళి, నరసన్నపేటకు బొబ్బాది వినయ్, సారవకోటకు బి.డిల్లీశ్వరరావు, ప్రచార విభాగానికి సంబంధించి పోలాకికి గేదెల రాజారావు, జలుమూరుకు వాన గణేష్, నరసన్నపేటకు కోరుకొండ శాంతారావు, సారవకోటకు నిక్కు వెంకట కృష్ణారావులను నియమించారు.

మర్యాదపూర్వక భేటీ



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుగా ఉంటూ ఇటీవల పార్టీ పదవులు పొందిన శ్రీకాకుళం నియోజకవర్గానికి చెందిన నాయకులు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్‌ను శనివారం కలిశారు. పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా చల్ల శ్రీను, వెలమ కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా అంబటి శ్రీనివాసరావులను నియమించిన విషయం విదితమే. దీంతో వీరు కృష్ణదాస్‌ను నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు రుషి , మండవల్లి రవి తదితరులు ఉన్నారు. – నరసన్నపేట

శిథిల భవనాల్లో చిన్నారులు..!

- అంగన్‌వాడీలకు మౌలిక వసతులు కరువు
- ఎప్పుడు కూలిపోతాయో తెలియని వైనం
- బిక్కుబిక్కుమంటున్న చిన్నారులు



శిథిలమైన వెన్నెలవలస అంగన్‌వాడీ కేంద్రం

సరుబుజ్జిలి: చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరడం లేదు. కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక శిథిల భవనాలు, ఇరుకైన అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో మొత్తం 345 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

శిథిల భవనాల్లో సతమతం

అంగన్‌వాడీలను చాలాచోట్ల శిథిల భవనాల్లో నిర్వహిస్తున్నారు. సరుబుజ్జిలి మండలంలోని వీరభద్రాపురం, డకరవలస, విజయరాంపురం, అవతరాబాద్, రొట్టవలస, చినకాగితాపల్లిలో భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆమదాలవలస మండలంలోని దూసి, చెవ్వాకులపేట, రామచంద్రాపురం, దూసిపేట భవనాలు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. బూర్జ మండలంలోని కాఖండ్యాం, తిమడాం, లక్కుపురం, తోటవాడ, బూర్జ కేంద్రాలు ప్రమాదకరంగా మారాయి. పొందూరు మండలంలో కూడా పలుచోట్ల ఇబ్బందులు ఉన్నాయి. శిథిల భవనాల్లో కేంద్రాల నిర్వహణ వలన చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల అంగన్‌వాడీలకు పంపించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంజూరు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరు చేయాలి. పిల్లలు శిథిల భవనాలు, ప్రైవేటు బిల్డింగ్‌లు, పాఠశాల భవనాల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. చాలాచోట్ల కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– మూడడ్ల భద్రమ్మ, రొట్టవలస, సరుబుజ్జిలి మండలం

దృష్టి సారించాలి



అంగన్‌వాడీ కేంద్రాలకు కావాల్సిన మౌలిక వసతులపై కూటమి ప్రభుత్వం పెద్దగా దృష్టి సారించడం లేదు. కొన్నిచోట్ల మరుగుదొడ్లు, పిల్లల ఆటలకు సంబంధించిన పరికరాలు కూడా లేవు. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

– పున్నపురెడ్డి తవిటినాయుడు, మర్రిపాడు

ప్రతిపాదనలు పంపించాం

పలుచోట్ల అంగన్‌వాడీ నూతన భవనాల నిర్మాణాలకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించాము. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపట్టడం జరుగుతుంది.

– ఎస్.గీత, ఐసీడీఎస్ పీవో, బూర్జ ప్రాజెక్టు

ప్రారంభమెన్నడో..?




పూర్తయిన బాలికల వసతి గృహ భవనం

- ప్రారంభానికి నోచుకోని వసతి గృహం
- అవస్థలు పడుతున్న విద్యార్థినులు

పాతపట్నం: స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు సంబంధించిన బాలికల వసతి గృహాన్ని ప్రారంభించేదెన్నడోనని విద్యార్థినులు, తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ఈ కళాశాలకు రూ.12 కోట్ల రూసా నిధులతో అదనపు తరగతులు, బాలికల, బాలుర వసతి గృహాల నిర్మాణాలు చేపట్టారు. ముందుగా కళాశాల అదనపు గదులు ప్రారంభించారు. అనంతరం రెండు సంవత్సరాల క్రితం బాలుర వసతి గృహం కూడా ప్రారంభించారు. కానీ అన్ని పనులు పూర్తయ్యినప్పటికీ బాలికల వసతి గృహం మాత్రం ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. వాస్తవానికి ఈ కళాశాలకు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు చదువు కోసం వస్తుంటారు. పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, సారవకోట, కొత్తూరు మండలాలతో పాటు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి విద్యార్థినులు కళాశాలలో చదవుతుంటారు. అందువలన వసతి గృహం ప్రారంభిస్తే వీరందరికీ మేలు జరుగుతుందని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రాకపోకలతో ఇబ్బంది



మా గ్రామం నుంచి చదువుకోవడం కోసం విద్యార్థినులు ప్రతిరోజూ రాకపోకలు చేస్తుంటారు. గత సంవత్సరం వసతి గృహం ప్రారంభమవుతుందని అధ్యాపకులు చెప్పారు. వసతి గృహం ప్రారంభిస్తే ఒత్తిడి లేకుండా చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతి గృహం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలి.

– బగంతర భాస్కరరావు, తెంబూరు, పాతపట్నం మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



బాలికల వసతి గృహం పనులు పూర్తయినప్పటికీ విద్యుత్ పనులు చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తాం.

– కె.శ్రీరాములు, ప్రిన్సిపాల్, మోడల్ డిగ్రీ కళాశాల, పాతపట్నం

బాలికా సంరక్షణ అందరి బాధ్యత



జలుమూరు: వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



హిరమండలం: ఎల్ఎన్‌పేటలో మాట్లాడుతున్న మన్మథకుమార్ మిశ్రో

హిరమండలం: బాలికా సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, సామాజికవేత్త లయన్స్ మన్మథ కుమార్ మిశ్రో అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఎల్ఎన్‌పేట ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభాష్ చంద్రపండా, గౌతమి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు: బాలికలకు ఉన్నత విద్య చదివిస్తే దేశం అన్ని రంగాల్లో ముందుంటుందని స్త్రీ సంక్షేమ శాఖ పర్యవేక్షకురాలు సీతారత్నం అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం పురస్కరించుకొని శ్రీముఖలింగంలో విద్యార్థినులకు చిత్రలేఖనం, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాఘవ, కార్యకర్తలు చంద్రకళ, దేవి, మాలతి భవానీ తదితరులు పాల్గొన్నారు.